క్లుప్తంగా

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

గద్వాల అర్బన్: కొత్త ట్రాన్స్‌ఫార్మర్ల ఏర్పాటు, చెట్లను తొలగించనున్న నేపథ్యంలో గురువారం విద్యుత్ సరఫరాలో తాత్కాలిక అంతరాయం ఉంటుందని విద్యుత్‌శాఖ ఏఈ శివకుమార్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 9గంటల నుంచి 11గంటల వరకు జిల్లా కేంద్రంలోని న్యూహౌసింగ్ బోర్డు, టీచర్స్ కాలనీ, పాత ఎస్పీ ఆఫీస్, హమాలీ కాలనీ, జమ్ములమ్మ ఆలయం ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాను నిలిపేస్తున్నట్లు పేర్కొన్నారు.

మల్దకల్: మండలంలోని మల్లెందొడ్డి, మల్దకల్ గ్రామాల్లోని విద్యుత్ సబ్‌స్టేషన్లలో మరమ్మతులు, ఇతర పనుల కారణంగా బుధవారం ఉదయం 8గంటల నుంచి 11గంటల వరకు ఆయా విద్యుత్ సబ్‌స్టేషన్ల పరిధిలోని గ్రామాలకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని అయిజ ఏడీఈ గోవిందు, మల్దకల్ ఏఈ దుర్గప్రసాద్‌లు తెలిపారు. ప్రజలు, రైతులు గమనించి విద్యుత్ అధికారులకు సహకరించాలని వారు కోరారు.

చీని చెట్లను నరికిన దుండగులు



అయిజ: పంట చేనులో కష్టపడి పెంచిన చీని చెట్లను గుర్తు తెలియని వ్యక్తులు నరికేసిన సంఘటన మంగళవారం రాత్రి చోటుచేసుకుంది. మండలంలోని ఉప్పల గ్రామానికి చెందిన సరస్వతమ్మ పంట పొలంలో నాలుగు సంవత్సరాల క్రితం చీని చెట్లను సాగుచేశారు. బుధవారం చీనిచెట్లకు నీరు పెట్టేందుకు జీతగాడు వెళ్లగా పంట పొలంలో కొన్ని చీని చెట్లు నేలకొరిగి ఉన్నాయి. ఈ విషయం తెలుసుకున్న పొలం యజమాని సరస్వతమ్మ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

ఇంటింటా గోవింద నామస్మరణ

శాంతినగర్: ఇంటింటా గోవిందనామస్మరణలో భాగంగా వడ్డేపల్లి పురపాలిక పరిధిలోని శాంతినగర్ పట్టణంలో తొగట శ్రీరామచంద్రుడు ఇంట్లో ప్రత్యేక కార్యక్రమం జరిపించారు. హనుమాన్ ఛాలీసా పారాయణం చేశారు. ఈ సందర్భంగా భక్తులు ఆలపించిన గోవింద నామస్మరణలు పట్టణంలో మార్మోగాయి. కార్యక్రమంలో శ్రీవారి సేవకులు గాయత్రి శ్రీనివాసులు, టెలిఫోన్ కృష్ణుడు, రమేష్‌కుమార్, వెంకట్రాముడు, లక్ష్మణ్, మధు, శ్రీహరి, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

పిచ్చి మొక్కలు తొలగించండి



రాజోళి: కొత్త రాజోళిలోని పునరావాస గృహాల మధ్య పిచ్చి మొక్కలు విచ్చలవిడిగా పెరిగాయని, వాటిని తొలగించాలని స్థానికులు కోరుతున్నారు. ఎన్నో ఏళ్ల నుంచి గృహాల మధ్య సమస్యలు తీరడం లేదని వాపోయారు. గతంలో పిచ్చి మొక్కల తొలగింపునకు సర్పంచ్‌కు చెప్పేవాళ్లమని, ప్రస్తుతం ఎవరికి చెప్పాలో తెలియడం లేదని, అధికారులు అటు వైపు రావడం లేదని తెలిపారు. వర్షాకాలం కావడంతో విష సర్పాలు సంచరిస్తాయని, వాటితో పాటు పందులు ఆవాసాలు ఏర్పాటు చేసుకుని, రోగాలకు కారణమవుతున్నాయని తెలిపారు. అధికారులు స్పందించి సమస్యలు పరిష్కరించాలని కోరారు.

పీఎం కిసాన్ పథకం లబ్ధిదారుల పరిశీలన

మానవపాడు: మండల కేంద్రం, చెన్నిపాడు, గ్రామాలలో పీఎం కిసాన్ పథకం లబ్ధిదారుల ఫిజికల్ పరిశీలన నిర్వహిస్తున్నామని వ్యవసాయ విస్తరణ అధికారి మణిప్రకాశ్ తెలిపారు. బుధవారం మండలంలోని చెన్నిపాడు, మానవపాడులో గ్రామాలలో పరిశీలన నిర్వహించారు. ఆయా గ్రామాల ప్రజలు రైతులు వారి సంబంధిత ఏఈఓలను కలిసి త్వరగా చెప్పించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో రైతులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఇసుక ట్రాక్టర్ పట్టివేత

కేటీదొడ్డి: ప్రభుత్వం నుంచి ఎలాంటి అనుమతి లేకుండా అక్రమంగా ఇసుకను తరలిస్తున్న ట్రాక్టర్‌ను పోలీసులు బుధవారం పట్టుకున్నారు. ఎస్‌ఐ శ్రీనివాస్‌రావు వివరాల మేరకు.. గట్టు మండలం గొర్లఖాన్‌దొడ్డి గ్రామానికి చెందిన గవ్వ తిమ్మప్ప అనుమతి లేకుండా ఇసుకను గొర్లఖాన్‌దొడ్డి నుంచి మల్లాపురంతండా వైపు తరలిస్తున్నట్లు సమాచారం అందడంతో పోలీసులు మల్లాపురం శివారులోని ఇసుక ట్రాక్టర్‌ను తెల్లవారు జామున 3గంటలకు పట్టుకున్నారు. పోలీస్‌స్టేషన్‌కు తరలించి గవ్వ తిమ్మప్ప కేసు నమోదు చేసినట్లు తెలిపారు. ఎవరైనా చట్టానికి వ్యతిరేకంగా ఇసుకను తరలిస్తే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్‌ఐ హెచ్చరించారు.

వనమహోత్సవానికి శ్రీకారం

- విద్యుత్ తీగల కింద నాటొద్దు
- ప్రారంభమైన కార్యక్రమం
- ప్రతి మొక్క బతికేలా ప్రణాళిక



మానవపాడులో వనమహోత్సవం మొక్కలు నాటిస్తున్న అధికారులు

మానవపాడు: అంతరించిపోతున్న అడవులను కాపాడు కోవడంతో పాటు పర్యావరణ పరిరక్షణకు గత కొన్నేళ్లుగా చేపడుతున్న హరితహార కార్యక్రమాన్ని ఈ ఏడాది కొనసాగించాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. 2015 నుంచి హరితహారం పేరుతో నిర్వహించే ఈ కార్యక్రమాన్ని ప్రస్తుతం వన మహోత్సవంగా నిర్వహించాలని సంకల్పించింది. ఈ ఏడాది మండలంలో వివిధ గ్రామాల వారీగా మొక్కలను నాటాలని నిర్దేషించారు. మానవపాడు మండలంలోని 17 గ్రామ పంచాయతీల్లో ఆయా గ్రామాల వారీగా హరితహార కార్యక్రమాలను అధికారులు ప్రారంభించారు. వనమహోత్సవ కార్యక్రమాన్ని విజయవంతం చేయడానికి అధికారులు పక్కా ప్రాణాళికలు తయారు చేస్తున్నారు. గ్రామాల్లో పచ్చదనం పెంచేవిధంగా ప్రభుత్వ ఆదేశాల మేరకు సంబంధిత అధికారులు పల్లెల్లో నర్సరీలను ఏర్పాటు చేసి, వాటిలో పెరిగిన మొక్కలు నాటేందుకు ఉపాధిహామీ అధికారులు స్థలాలను గుర్తించి మొక్కలు నాటే కార్యక్రమం చేపట్టారు.

మండల వ్యాప్తంగా ఇలా..

పదో విడత వనమహోత్సవ కార్యక్రమంలో భాగంగా 17 గ్రామాల్లో 17 నర్సరీలు, బృహత్‌పల్లె ప్రకృతివనాలను ఏర్పాటు చేశారు. గ్రామాల్లో ఏర్పాటు చేసిన నర్సరీల్లో 4వేల మొక్కల చొప్పున సుమారు 20 రకాల మొక్కలను పెంచారు. ఉపాధిహామీ పథకం ద్వారా నియమించిన వన సంరక్షకుల ద్వారా నర్సరీల్లో మొక్కల పెంపకం, సంరక్షణ చర్యలు చేపట్టారు. ఆయా నర్సరీలను ఉపాధిహామీ అధికారులు ఎప్పటికప్పుడు పర్యవేక్షణ చేస్తూ మొక్కలు పెంచారు. ప్రతి నర్సరీల్లో కానుగ, గుల్మోహన్, మునగ, సీమ తంగెడు, ఖర్జూర, దానిమ్మ, మందారం తదితర మొక్కలను పెంచారు. వన మహోత్సవంలో పండ్లు, పూలమొక్కలకు ప్రాధాన్యత ఇవ్వనున్నారు. మండలంలోని 17 గ్రామాల్లో చాలా తక్కువగా పండ్ల, పూల మొక్కలు నాటారు. వాటిలో మొలకెత్తినవి గ్రామాల్లో అతి తక్కువగా పెరిగాయంటే అతిశయోక్తి కాదు. అందుకే ప్రభుత్వం పండ్లు, పూల మొక్కలను పెంచాలని నిర్ణయించింది.



పల్లెపాడులో మొక్కలు నాటుతున్న ఎంపీపీ అశోక్‌రెడ్డి, ఎంపీడీఓ ఆంజనేయరెడ్డి

లక్ష్యం ఇలా..

మండలంలోని 17 గ్రామ పంచాయతీల్లో ఒక్కో గ్రామానికి 3500 మొక్కలు మండల వ్యాప్తంగా దాదాపు 50వేల మొక్కలు లక్ష్యంగా పెట్టుకున్నామన్నారు. ఇప్పటికే దాదాపు పల్లెపాడు, జల్లాపురం, బోరవెల్లి, చండూరు, పెద్దపోతులపాడు, చిన్నపోతులపాడు గ్రామాలలో మొక్కలను నాటుతున్నారు. మరికొన్ని గ్రామాలలో మొక్కలను నాటడానికి గుంతలను సిద్ధం చేస్తున్నారు.

పచ్చదనం పరచుకునేలా..

నర్సరీల్లో పెంచిన ప్రతి మొక్కనూ నాటి పల్లెల్లో పచ్చదనం పరచుకునేలా అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. చనిపోయిన మొక్కల స్థానంలో ప్రభుత్వ స్థలాల్లో, రోడ్లవెంట, నూతనంగా మొక్కలు నాటే కార్యక్రమం నిర్వహిస్తున్నారు. నాటిన ప్రతి మొక్కను బతికించుకునేందుకు గ్రామస్తుల సహకారం ఉండేలా అధికారులు ప్రజలకు అవగాహన కల్పించారు. మొక్కలు చనిపోతే గ్రామస్తులు వెంటనే మండల స్థాయి అధికారులకు తెలియజేసి చనిపోయిన మొక్కల స్థానంలో మరో మొక్కను నాటేందుకు ప్రణాళికలు తయారు చేస్తున్నారు.

ప్రతి మొక్క బతికేలా చూడాలి



పల్లెల్లో నాటిన ప్రతి మొక్క బతికేలా అధికారులు చర్యలు తీసుకోవాలి. ప్రజాధనం దుర్వినియోగం చేయకూడదు. వనమహోత్సవ కార్యక్రమం గురించి ప్రజలకు, గ్రామీణులకు సమగ్రంగా అవగాహన కల్పించాలి. గ్రామాల్లో యువత చైతన్యం కావాలి. మొక్కలు విరివిగా నాటాలి.

– వెంకటేష్, చెన్నిపాడు

విద్యుత్ తీగల కింద నాటకూడదు



మండలంలోని ఆయా గ్రామాల్లో రోడ్ల గుండా ఉన్న విద్యుత్ తీగల కింద పెద్ద మొక్కలను నాటకూడదు. ముందస్తుగా మొక్కలను నాటకుండా ఉంటే బాగుంటుంది. మండల స్థాయి అధికారులు విద్యుత్ తీగల గుండా అందమైన మొక్కలను నాటే విధంగా చర్యలు తీసుకోవాలి. నాటిన మొక్కలు బతికేలా చర్యలు తీసుకోని మొక్కలను నరికివేయకుండా చర్యలు తీసుకోవాలి.

– బజారన్న, మానవపాడు

గ్రామస్తులు సహకరించాలి



మండలంలోని ఆయా గ్రామాల్లో రోడ్లగుండా, పొలాల గెట్ల వెంట మొక్కలను నాటుతున్నారు. గ్రామస్తులు సహకరించాలని కోరుతున్నాం. ప్రతి నర్సరీల్లో 4000 మొక్కలను పెంచాం. ప్రతి గ్రామంలో 3500 మొక్కలు నాటేలా చర్యలు తీసుకుంటున్నాం. నాటిన ప్రతి మొక్క బతికేలా అన్ని రకాల చర్యలు తీసుకోంటున్నాం. ప్రతి గ్రామంలోని గ్రామస్తులు, యువత అధికారులకు సహకరించాలి.

– ఆంజనేయరెడ్డి, ఎంపీడీఓ మానవపాడు

బ్యాంకులో సమస్యలపై వినతి



ఉండవెల్లిలోని ఎస్‌బీఐ మేనేజర్‌కు వినతి పత్రం అందజేస్తున్న ప్రజలు

ఉండవెల్లి: మండల కేంద్రంలోని ఎస్‌బీఐ బ్యాంక్‌లో కొద్ది నెలలుగా ఏటీఎమ్ పనిచేయడం లేదని, ప్రింటింగ్ మిషన్ పనిచేయడం లేదని, స్టాఫ్ తక్కువగా ఉండడంతో ఖాతాదారులు ఇబ్బందులు పడుతున్నారని రైతు సంఘం సభ్యులు, 10 గ్రామాల ప్రజలు బ్యాంక్ మేనేజర్ ధనుంజయ్‌కు వినతి పత్రం అందజేశారు. బుధవారం స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా బ్యాంక్‌లో ఖాతాదారులకు ఒకే క్యాషీయర్ ఉండడంతో, పాస్ బుక్కులు ప్రింటింగ్ మిషన్ పని చేయకపోవడంతో, ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తామని మేనేజర్ ధనుంజయ్ సానుకూలంగా స్పందించారు. మేనేజర్‌గా ధనుంజయ్ బాధ్యతలు స్వీకరించినట్లు తెలిపారు. కార్యక్రమంలో రైతు సంఘం సభ్యులు జ్ఞానేశ్వర్‌రెడ్డి, గోద చిన్న మద్దిలేటి, గోవిందు, గ్రామ పెద్దలు మహదేవయ్య, శేఖర్‌రెడ్డి, రామ్ కోటిరెడ్డి, భీముడు, కటారి గోవిందు, సూరయ్య, కంచుపాడు గోకారి, హనుమంతు, సుబ్బారెడ్డి, కర్ణాకర్ రెడ్డి, ప్రభాకర్ రెడ్డి, జయ్యన్న, రాముడు, మురళి, షేషావల్లి పాల్గొన్నారు.

విద్యుత్ స్తంభం ఏర్పాటు



సాక్షి ఎఫెక్ట్..

అలంపూర్ రూరల్: 'అధికారులకు సమస్యలు పట్టడం లేదు' అనే శీర్షికతో 'సాక్షి' పత్రికలో వచ్చిన వార్తకు స్పందించిన విద్యుత్ అధికారులు బుధవారం నూతన విద్యుత్ స్తంభం ఏర్పాటు చేశారు. మండల పరిధిలోని లింగన్‌వాయిలోని శ్రీ కృష్ణదేవరాయ విగ్రహం దగ్గర ఎన్నో ఏళ్ల క్రితం ఏర్పాటు చేసిన విద్యుత్ స్తంభం విరిగేందుకు సిద్ధంగా ఉందని, వచ్చిన శీర్షికకు విద్యుత్ అధికారులు స్పందించి నూతన స్తంభం, పైపులైన్లు వేయడంపై జిల్లా రైతు సంఘం అధ్యక్షులు జీకే ఈదన్న, గ్రామ ప్రజలు, రైతులు 'సాక్షి' పత్రికకు అభినందనలు తెలిపారు.

సైబర్ నేరాలపై అవగాహన కలిగి ఉండాలి



సైబర్‌నేరాలపై అవగాహన కల్పిస్తున్న పోలీసులు

అయిజ: సైబర్ నేరగాళ్లు రోజు రోజుకు కొత్త విధనాలను అవలంభిస్తున్నారని, సాంకేతిక పరిజ్ఞానంతో కొత్త కొత్త మార్గాలలో జరుగుతున్న సైబర్ నేరాలపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి, జాగ్రత్తగా ఉండాలని సైబర్ సెక్యూరిటీ వింగ్ ఇన్‌స్పెక్టర్ రాజు అన్నారు. సైబర్ జాగృతి దివాస్ సందర్భంగా డిస్ట్రిక్ సైబర్‌క్రైం బ్యూరో ఆధ్వర్యంలో బుధవారం మండల కేంద్రంలో ఎస్‌ఐ విజయభాస్కర్‌తో కలిసి ప్రజలకు సైబర్ నేరాలపై అవగాహన కల్పించారు. సైబర్ నేరాలకు గురికాకుండా తీసుకోవల్సిన జాగ్రత్తల గురించి తెలిపారు. సైబర్ మోసం జరిగిన వెంటనే బాధితులు 1930కు ఫోన్ చేసి ఫిర్యాదు చేయాలని సూచించారు. కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

ఇన్‌చార్జి ఎంపీడీఓగా పద్మావతి

ఉండవెల్లి: మండల కేంద్రంలోని ఎంపీఓ పద్మావతి ఇన్‌చార్జి ఎంపీడీఓగా బుధవారం బాధ్యతలు చేపట్టారు. ప్రస్తుత ఎంపీడీఓ అబ్దుల్ జబ్బార్ పదవీ విరమణ పొందడంతో ఆ స్థానంలో ఇన్‌చార్జి ఎంపీడీఓగా బాధ్యతలు అప్పగించినట్లు ఉత్తర్వులు జారీ చేసినట్లు తెలిపారు.

మొక్కలను విరివిగా పెంచాలి

మానవపాడు: మొక్కలను విరివిగా పెంచాలని ఎంపీడీఓ ఆంజనేయరెడ్డి సూచించారు. బుధవారం మండలంలోని బోరవెల్లిలో నాటే కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయ న మాట్లాడారు. ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలని సూచించారు. ఆయా గ్రామాల్లో ఈ కార్యక్రమాన్ని చేపట్టారు. కార్యక్రమంలో ప్రజాప్రతిని ధులు, అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

పాఠశాల అదనపు గది ప్రారంభం



అదనపు గది ప్రారంభంలో స్వచ్ఛంద సంస్థ ప్రతినిధులతో రంజిత్‌కుమార్, బాసు శ్యామల

గట్టు: మండలంలోని బల్గెర గ్రామంలో స్ట్రీట్ కాజు స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో నూతనంగా నిర్మించిన అదనపు గదితో పాటుగా ప్రహరీని బుధవారం నడిగడ్డ హక్కుల పోరాట సమితి జిల్లా కన్వీనర్ రంజిత్‌కుమార్, జెడ్పీటీసీ బాసు శ్యామల ప్రారంభించారు. హైదరాబాదుకు చెందిన స్ట్రీట్ కాజు స్వచ్ఛంద సంస్థ బల్గెరలో విద్యార్థుల సౌకర్యార్థం నూతనంగా అదనపు తరగతి, పాఠశాల ప్రహరీ నిర్మించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థులు క్రమం తప్పక పాఠశాల వస్తూ, చక్కగా చదువుకుని భవిష్యత్‌లో ఉన్నత శిఖరాలను చేరుకోవాలన్నారు. స్వచ్ఛంద సంస్థ ముందుకొచ్చి ఇలాంటి కార్యక్రమాలు చేయడం అభినందనీయమన్నారు. స్వచ్ఛంద సంస్థ ప్రతినిధి గోకరాజు రంగరాజును ప్రత్యేకంగా అభినందించారు. కార్యక్రమంలో బలరాం, వెంకట్రాములు, ఆంజనేయులు, సురేష్, బత్తలయ్య, నర్సింహులు, అహ్మద్, శివన్న, తిమ్మప్ప, బజారి, రాఘవేంద్ర, లక్ష్మన్న, స్వచ్ఛంద సంస్థ ప్రతి నిధులు పవన్‌కుమార్, రాజేష్, రోహిత్, బొలు, వినీత, మాతృక పాల్గొన్నారు.

ధర్నాకు తరలిన కార్మికులు



ధర్నాకు తరలివెళ్తున్న కార్మికులు

గద్వాల అర్బన్: కార్మికులపై వేధింపులు, వెట్టిచాకిరి, జీఓ నెం 60ప్రకారం జీతాలు చెల్లించాలని డిమాండ్ చేస్తూ బుధవారం హైదరాబాద్‌లో కోఠిలోని డీఎంఈ కార్యాలయం ముందు చేపట్టిన ధర్నాకు జిల్లా ప్రభుత్వ ఆస్పత్రి కార్మికులు పెద్ద ఎత్తున్న తరలివెళ్లారు. ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు ఆంజనేయులు జెండా ఊపీ వాహనాలను ప్రారంభించారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ నాయకులు నాగరాజు, జగదీష్, మతీన్, ఆంజనేయులు, నాగేంద్రమ్మ తదితరులు ఉన్నారు.

బిల్లులు మంజూరు చేయండి



ఉండవెల్లిలో ఇన్‌చార్జి ఎంపీడీఓకు వినతి పత్రం అందజేస్తున్న ఆయా గ్రామాల మాజీ సర్పంచులు

ఉండవెల్లి: గ్రామ పంచాయతీల్లో పనులు చేసిన బిల్లులను త్వరగా మంజూరు చేయాలని ఇన్‌చార్జి ఎంపీడీఓ పద్మావతికి వివిధ గ్రామాల మాజీ సర్పంచులు వినతి పత్రాలు అందజేశారు. బుధవారం మండలంలోని పలు గ్రామాల్లో గ్రామ పంచాయతీ పనుల బిల్లులు రాకపోయిన చేశామని, తమ బాధ్యతలు అయిపోయినా పట్టింపులేదని పేర్కొన్నారు. చేసిన పనులకు బిల్లులు చెల్లించేలా చూడాలని ఎంపీడీఓను కోరారు. కార్యక్రమంలో మండల సర్పంచుల సంఘం మాజీ అధ్యక్షుడు సురవరం లోకేశ్వర్ రెడ్డి, మాజీ సర్పంచులు శేషన్ గౌడు, నాగేష్, శివ రాములు, శివ నారాయణ, బైరాపురం భాస్కర్, కలుగోట్ల మజీద్ మియ్యా, తదితరులు పాల్గొన్నారు.

కేసీఆర్ హయాంలోనే గ్రామాలు అభివృద్ధి

- గద్వాల ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి



మల్దకల్‌లో ఎంపీపీ, జెడ్పీటీసీ, ఎంపీటీసీలతో ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి

మల్దకల్: కేసీఆర్‌తోనే తెలంగాణ రాష్ట్రంలో గత పదేళ్ల గ్రామాలు అన్ని విధాలుగా అభివృద్ధి చెందాయని గద్వాల ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి అన్నారు. బుధవారం ఎంపీడీఓ కార్యాలయ సమావేశపు హాల్లో ఎంపీపీ, జెడ్పీటీసీ, ఎంపీటీసీల తో ఏర్పాటు చేసిన ప్రత్యేక సమావేశానికి ఎమ్మెల్యే హాజరై మాట్లాడారు. మాజీ సీఎం కేసీఆర్ రైతుల అభివృద్ధి కోసం ఎన్నో సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టి వాటిని అమలు చేసి, దేశంలోని తెలంగాణకు గుర్తింపును తీసుకొచ్చినట్లు ఆయన తెలిపారు. గ్రామాలను అన్ని విధాలుగా అభివృద్ధి చేసినట్లు తెలిపారు. అనంతరం ఎంపీపీ, జెడ్పీటీసీ, ఎంపీటీసీలను ఎమ్మెల్యే సన్మానించారు. వారు చేసిన సేవలను ఆయన కొనియాడారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి ఎంపీడీఓ ప్రవీణ్‌కుమార్‌రెడ్డి, సూర్యప్రకాష్‌రెడ్డి, ఎంపీపీ రాజారెడ్డి, జెడ్పీటీసీ ప్రభాకర్‌రెడ్డి, సింగిల్ విండో అధ్యక్షుడు తిమ్మారెడ్డి, వైస్ ఎంపీపీ పెద్దవీరన్న, బీఆర్‌ఎస్ నాయకులు పాల్గొన్నారు.

ఉద్యోగం సాధించిన యువకుడికి సన్మానం

గట్టు: మండలంలోని ముచ్చోనిపల్లె గ్రామానికి చెందిన యువకుడు ప్రేమ్‌రాజును గద్వాల ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి ప్రత్యేకంగా అభినందించారు. ముచ్చోనిపల్లె మాజీ సర్పంచు చిన్న గోవిందు కుమారుడు ప్రేమ్‌రాజు ఒకేసారి మూడు ప్రభుత్వ ఉద్యోగాలకు ఎంపికయ్యాడు. ప్రస్తుతం రైల్వే డిపార్టుమెంట్‌లో పని చేస్తూనే, గ్రూపు–4, కానిస్టేబుల్‌కు ఎంపికయ్యాడు. ఈ విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి సదరు యువకుడిని సన్మానించి, అభినందించారు. ముచ్చోనిపల్లె గ్రామంలో ప్రేమ్‌రాజు తొలి ప్రభుత్వ ఉద్యోగం సాధించినట్లు గ్రామస్తులు తెలిపారు. యువకులు ఉద్యోగ సంపాదనే లక్ష్యంగా ముందుకు సాగాలని, తల్లిదండ్రులకు, సొంత ఊరికి మంచి పేరును తీసుకు రావాలని ఎమ్మెల్యే కోరారు. కార్యక్రమంలో ఎంపీపీ విజయ్‌కుమార్, జెడ్పీటీసీ బాసు శ్యామల, జిల్లా గ్రంథాలయాల సంస్థ మాజీ చైర్మన్ జంబురామన్‌గౌడు, సర్పంచుల సంఘం మాజీ అధ్యక్షుడు హనుమంతు, మాజీ సర్పంచు చిన్న గోవిందు, బీఆర్‌ఎస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

బాలలు సురక్షిత వాతావరణంలో పెరగాలి



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న బాలల సంక్షేమ సమితి మెంబర్ జయభారతి

కేటీదొడ్డి: బాల్యం పిల్లల హక్కు అని వారందరూ సురక్షిత వాతావరణంలో పెరగాలని జిల్లా బాలల సంక్షేమ సమితి మెంబర్ జయభారతి అన్నారు. బుధవారం మండలంలోని చింతలకుంట పాఠశాలలో మహిళా శిశు సంక్షేమ శాఖ బాలల పరిరక్షణ ఆధ్వర్యంలో బాలల సంరక్షణపై అవగాహన నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆడపిల్లలతో సోదరిభావంతో ఉండాలని బాలల లైంగిక వేధింపుల నిరోధక చట్టం 2012 గురించి తెలియజేస్తూ లైంగిక వేధింపుల నుంచి రక్షణ కల్పించేందుకు ఈ చట్టం రూపొందించారని, ఈ చట్టంలో బాలబాలికలకు సమానమైన రక్షణ లభిస్తుందని తెలిపారు. బాలలను ఎవరైనా వేధిస్తే 100 లేదా 1098కి ఫోన్ చేసి ఫిర్యాదు చేస్తే చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో ఐసీపీఎస్ కౌన్సిలర్ సురేష్, సోషల్ వర్కర్ పద్మ, మెడికల్ ఆఫీసర్ విజయ్‌కాంత్ చైల్డ్‌లైన్ శివలీల, సఖి కేంద్రం శోభ, హెచ్‌ఎం భాస్కర్ ఉన్నారు.

దీక్షను విజయవంతం చేద్దాం



అంబేడ్కర్ విగ్రహంవద్ద నిరసన తెలుపుతున్న ఎమ్మార్పీఎస్ నాయకులు

అయిజ: ఎస్సీ వర్గీకరణ సాధన కోసం వంగంపల్లి దీక్షను విజయవంతం చేద్దామని ఎమ్మార్పీఎస్ జిల్లా గౌరవ అధ్యక్షుడు హస్సన్ మాదిగ అన్నారు. కేంద్ర ప్రభుత్వం ఎస్సీ వర్గీకరణ అంశాన్ని పరిష్కరింకుండా జాప్యం చేస్తూ మాదిగలకు అన్యాయం చేస్తోందన్నారు. బుధవారం పట్టణంలోని అంబేడ్కర్ విగ్రహం వద్ద ఎమ్మార్పీఎస్ నాయకులు నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈనెల 7న హైదరాబాద్‌లోని ఇందిరాపార్క్ వద్ద ఎమ్మార్పీఎస్ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు వంగంపల్ల శ్రీనివాస్ మాదిగ చేపట్టనున్న దీక్షకు సంబంధించిన కరపత్రాలను విడుదల చేశారు. కార్యక్రమంలో మున్సిపాలిటీలోని ఎమ్మార్పీఎస్ నాయకులతో పాటు మండలంలోని వివిధ గ్రామాల ఎమ్మార్పీఎస్ నాయకులు పాల్గొన్నారు.

వసతిగృహాల్లో సమస్యలు తీర్చండి



విద్యార్థుల సమస్యలను తెలుసుకుంటున్న కేవీపీఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి రాజు

ఎర్రవల్లిచౌరస్తా: సాంఘిక సంక్షేమ వసతి గృహాల్లో విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలను తక్షణమే పరిష్కరించాలని కేవీపీఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి రాజు అన్నారు. బుధవారం ఎర్రవల్లి మండలంలోని ధర్మవరం బీసీ బాలుర వసతి గృహాన్ని ఆయన ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా వసతి గృహంలో గదులు, స్నానపు గదులు, మరుగుదొడ్లను పరిశీలించారు. విద్యార్థులకు అందిస్తున్న భోజనాన్ని పరిశీలించారు. విద్యార్థులకు ఉప్పు, కారం లేని అన్నం పెడుతున్నందున అనారోగ్యానికి గురవుతున్నారని మండిపడ్డారు. వసతి గృహంలోని నాలుగు గదులకు తలుపులు, కిటికీలు సక్రమంగా లేవన్నారు. 7గదులలో ఫ్యాన్లు ఉన్నా తిరగడం లేదన్నారు. రెండు గదులలో కరెంటు బోర్డులున్నా స్విచ్‌లు పనిచేయడం లేదన్నారు. వసతిగృహంపై ఉన్నతాధికారుల పర్యవేక్షణ లేకపోవడంతో వార్డెన్ నిత్యం రాకుండా ఇష్టానుసారంగా వ్యవహరిస్తూ విద్యార్థులను, వసతిగృహాన్ని ఏమాత్రం పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు వసతి గృహాన్ని తనిఖీ చేసి విద్యార్థుల సమస్యలను పరిష్కరించి వార్డెన్‌పై తగు చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. లేని పక్షంలో విద్యార్థులతో కలిసి ఆందోళన కార్యక్రమాలు చేస్తామని ఆయన హెచ్చరించారు.

ప్రైవేట్ పాఠశాలలో పుస్తకాల పట్టివేత



ప్రైవేట్ స్కూల్‌లో పట్టుబడిన పుస్తకాలతో నిరసన వ్యక్తం చేస్తున్న ఏబీవీపీ నాయకులు

గద్వాల అర్బన్: జిల్లాలో ప్రైవేట్ విద్యాసంస్థల దోపిడీకి అడ్డు అదుపు లేకుండా పోతున్నది. పాఠశాలల్లో పుస్తకాలు, నోట్ బుక్కులు అమ్మొద్దని స్పష్టమైన నిబంధనలు ఉన్నా పట్టించుకోవడం లేదు. తాజాగా జిల్లా కేంద్రంలోని ఓ ప్రైవేట్ పాఠశాలలో నోట్ పుస్తకాలు, యూనిఫాంలు నిల్వ ఉంచి విద్యార్థులకు అమ్ముతున్నారు. ఈ విషయం తెలుసుకున్న ఏబీవీపీ నాయకులు బుధవారం స్కూల్ వద్దకు వెళ్లి గదిలో నిల్వ ఉంచిన పుస్తకాలను పట్టుకోని స్కూల్ ముందు నిరసన వ్యక్తం చేశారు. అనంతరం ఎంఈఓ సురేష్‌కు సమాచారం అందించారు. అక్కడికి చేరుకున్న ఏంఈఓ ఎపుస్తకాలు నిల్వ ఉంచిన గదిని సీజ్ చేశారు. నిబంధనలకు విరుద్ధంగా పుస్తకాలు, నోట్‌బుక్స్, యూనిఫామ్స్ విక్రయిస్తున్న ప్రైవేటు పాఠశాలలపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఏబీవీపీ నాయకులు పాల్గొన్నారు.